క్లుప్తంగా

బోనాల పండుగకు ఏర్పాట్లు



నర్సంపేట : పట్టణంలోని 10వ వార్డు పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయంలో నేడు (శుక్రవారం) బోనాల పండుగ నిర్వహించనున్న క్రమంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో సమస్యను అధికారుల దృష్టికి కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్ గురువారం తీసుకెళ్లారు. అనంతరం ఆలయ పరిసరాల్లో డస్ట్‌తో కూడిన చిప్స్ పోయించారు. శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కుల పెద్దలు ఎదరబోయిన రామస్వామి, లక్క నరేందర్, కొలువుల నరేశ్, గిరబోయిన సురేశ్, కొలువుల శివ ఎల్లయ్య, మండల మధుసూదన్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రంలో తనిఖీ



దుగ్గొండి : మండలంలోని వెంకటాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని మండల వైద్యాధికారి కిరణ్‌రాజ్ గురువారం తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, బీపీ, షుగర్ బాధితుల వివరాల నమోదును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సలోమీ, హెచ్ఈఓ సాంబయ్య, పీహెచ్ఎన్ మనోజ, సూపర్‌వైజర్ సంధ్యారాణి, ఏఎన్ఎం రజిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు కలెక్టర్ దృష్టికి..



రాయపర్తి (వర్ధన్నపేట) : మండలంలోని పలు సమస్యలను అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తొలుత కలెక్టర్ సత్య శారదను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేశ్, బీసీ సంఘం నాయకుడు మామిళ్ల చెన్నై తదితరులు పాల్గొన్నారు.

నివాళి

ఖానాపురం : మండలంలోని మనుబోతులగడ్డకు చెందిన తేజావత్ లక్ష్మి (90) అనారోగ్యంతో గురువారం మృతి చెందగా ఆమె మృతదేహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వల్లెపు సోమయ్య, సొసైటీ డైరెక్టర్ ఆబోతు అశోక్‌యాదవ్, నాయకులు మస్తాన్, పురుషోత్తం, ఐలయ్య, ఈర్య, రవికుమార్, లతీఫ్, శ్రావణ్, రహీమ్ పాషా, రమేశ్ పాల్గొన్నారు.

అన్నారంలో..

పర్వతగిరి : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన ఒగ్గు లక్ష్మి (58) గురువారం మృతి చెందగా ఆమె మృతదేహానికి పీఏసీఎస్ చైర్మన్ ఎం.మనోజ్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జడల కృష్ణ, నాయకులు రాపోలు యాకయ్య, పాషా పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని ఊకల్‌కు చెందిన అనపర్తి రాములు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాల శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రావుల వెంకట్‌రెడ్డి, నాయకులు మోడికె యాకన్న, సంకినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేయూత

రాయపర్తి : మండలంలోని బురహాన్‌పల్లికి చెందిన బాలె కొమురయ్య ఇటీవల మృతి చెందగా ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం చేయూత అందించారు. బాధిత కుటుంబానికి సురేందర్ నాయక్, బాలె యాకయ్యలతో 75 కేజీల బియ్యం, 20 కేజీల నూనె డబ్బా పంపించారు.

'శవ రాజకీయాలు మానుకోవాలి'

చెన్నారావుపేట : శవ రాజకీయాలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ హితవు పలికారు. బాధిత కుటుంబాలను తాము పరామర్శించామని, నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరెడ్డి పోలీసులను ఆదేశించారని తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారని చెప్పారు. ఆరోపణలు విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మిరప సాగుకే రైతన్నల మొగ్గు

- జాగ్రత్తలు పాటిస్తే నాణ్యమైన నారు
- జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాసరావు



దుగ్గొండి: ఎంతగా నష్టాలు వస్తున్నా రైతులు ఎర్ర బంగారంపై ఆశవీడడం లేదు. మిరప పంటకు పెట్టింది పేరుగా వరంగల్ జిల్లాకు పేరు. నల్లబెల్లి, నర్సంపేట, దుగ్గొండి మండలాల్లో అధిక విస్తీర్ణంలో సాగు అవుతుంది. కాలం అనుకూలించి పంట అధిక దిగుబడి వస్తే ఇస్తే మంచి లాభాలు వస్తాయని రైతులు మిరప సాగుకు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో 12వేల ఎకరాల్లో మిరప పంట సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మిరప నార్లు పోయడానికి సన్నద్ధం అవుతున్నారు. ఆరోగ్యవంతమైన మిరప నారు నాటితేనే పంట బాగా వస్తుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసరావు వివరిస్తున్నారు.

నారుమడి..

నేలను బాగా దున్ని గుల్లబారేలా తయారు చేసుకోవాలి. రాళ్లు, మట్టి పెల్లలు లేకుండా చూసుకోవాలి. నారు పెంచడానికి మూడు అడుగుల వెడల్పుతో అరఅడుగు ఎత్తుగా ఉండేలా బెడ్లు తయారు చేసుకోవాలి. బెడ్ల మధ్య అడుగు వెడల్పు బాట తీసుకోవాలి. నేలను చదును చేసుకుని ఇంచు ఇంచు ఎడంతో అర సెంటీమీటరు లోతుగా గీత గీసుకుని మిరప గింజలు నాటుకోవాలి. కార్బండైజిమ్ మందుతోతో విత్తనశుద్ధి చేసుకోవాలి. చదును చేసిన నేలపై కార్బోఫ్యూరాన్ గుళికలు లేదా రిజెంట్ గుళికలు వేసుకుని విత్తనాలు విత్తుకోవాలి. విత్తనాలు నాటిన అనంతరం నేలపై కాపర్‌ఆక్సీక్లోరైడ్ మందును కలిపిన మట్టిని పలుచగా చల్లుకోవాలి. అనంతరం ఎండుగడ్డిని పరిచి చీరను పరవాలి. ఉదయం సాయంత్రం నీటిని పలచగా చల్లాలి. 7–8 రోజుల్లో మొలకలు వస్తాయి. ఆ తర్వాత గడ్డి, చీరలు జాగ్రత్తగా తీసివేయాలి. చీమలు రాకుండా కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలి. లీటరు నీటికి 2 గ్రాముల కాపర్‌ఆక్సీక్లోరైడ్ మందును కలిపి మొలకలపై చల్లుకోవాలి. ఇలా చేయడం వల్ల వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందుతుంది. 15 రోజులకు రెడోమిల్ గోల్డ్ మందు మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కలుపు మొక్కలను తీసివేయాలి. లేకుంటే చీడ పరుగులు ఆశిస్తాయి. ఇమామెక్టిన్ బెంజియేట్ మందును లీటరు నీటికి 2 గ్రాములు కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ రసాయన, పశువుల ఎరువులు వేయొద్దు. ఇలా వేస్తే నారు ఏపుగా పెరిగి లేతగా ఉంటుంది. లేత నారు నాటినప్పుడు త్వరగా చనిపోయే అవకాశం ఉంది. బలిష్టమైన నారును 40–45 రోజుల వ్యవధిలో నాటుకోవాలి.



మిరప విత్తనాలు నాటుతున్న కూలీలు



పెసరను భూమిలో కలియదున్నుతున్న రైతు

నేలను సిద్ధం చేస్తున్న రైతులు..

రైతులు మిరప పంట సాగు చేయడానికి ఎంచుకున్న భూమిలో పోషకాల లభ్యత కోసం పచ్చిరొట్ట పంటగా పెసర సాగు చేశారు. పెసర ఏపుగా పెరగడంతో కొంత మంది రైతులు ట్రాక్టర్ రోటోవీటర్ సాయంతో కలియదున్నుతున్నారు. దీంతో నేలలు సారవంతంగా మారుతున్నాయి.

పైప్‌లైన్‌కు మరమ్మతు



దుగ్గొండి : మరమ్మతు చేయిస్తున్న ఇన్‌చార్జ్ కార్యదర్శి వినోద్

దుగ్గొండి : మండల కేంద్రంలో లీకేజీకి గురైన మంచినీటి మెయిన్ లైన్‌కు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి వినోద్ గురువారం మరమ్మతులు చేయించారు. 'పగిలిన పైప్‌లైన్-మరమ్మతులో నిర్లక్ష్యం' శీర్షికతో 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేయడంతో ఇన్‌చార్జ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి వినోద్ పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించి మంచినీటి సరఫరాను పునరుద్ధరింపజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది రాంబాబు, స్వరూప, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

సాక్షి స్పందన

గుంతల పూడ్చివేత



ఖానాపురం : గుంతను పూడ్చుతున్న అధికారులు

ఖానాపురం : మండల కేంద్రంలోని రెండో బస్టాండ్‌గా గుర్తింపు పొందిన మనుబోతులగడ్డ రోడ్డులోని సెంటర్‌లోని గుంతలను అధికారులు పూడ్చివేశారు. 'గుంత పూడ్చడానికి ఇంకెన్నాళ్లు..?' శీర్షికతో ఈనెల 8న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి సుప్రజ ఆధ్వర్యంలో సిబ్బంది గుంతను గురువారం పూడ్చివేశారు. గుంతల్లో రోడ్డుకు సమానంగా కంకర, మట్టి పోసి చదును చేశారు. అలాగే పెద్దమ్మగడ్డ వరకు ఉన్న గుంతలను సైతం మట్టి పోసి పూడ్చివేశారు.

వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే మాధవరెడ్డి



నర్సంపేట : స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నర్సంపేట నియోజకవర్గంలోని పలు సమస్యలను మంత్రికి వివరించారు. అవసరమైన సహకారం అందించాల్సిందిగా కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు.

సన్మానం



దుగ్గొండి : మండలంలోని పొనకల్‌లో ఇటీవల పదవీ విరమణ చేసిన ఎంపీటీసీ బండి జగన్, పంచాయతీ పాలకవర్గాన్ని గ్రామస్తులు గురువారం జ్ఞాపిక అందించి శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ అరుంధతి హాజరై మాట్లాడారు. పదవులతో నిమిత్తం లేకుండా ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుపతి, ఎంపీఓ శ్రీధర్, ఏపీఓ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ భద్రునాయక్, పంచాయతీ కార్యదర్శి కవిత, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో సమస్యల పరిష్కారమే ధ్యేయం

రాయపర్తి : పల్లెల్లోని సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మండలంలోని గ్రామాల్లో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఏకేతండాలో గురువారం వారు పర్యటించి సమస్యలపై అధ్యయనం చేశారు. అనంతరం హామ్యానాయక్, రవీందర్‌రెడ్డి మాట్లాడారు. అంతర్గత సీసీ రోడ్లు, బస్సు సౌకర్యం, విద్యుత్ సరఫరా, హెల్త్ సబ్‌సెంటర్, మినీ ఫంక్షన్ హాల్, విద్యుత్ స్తంభాలు తదితర సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. సమస్యలను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు హలావత్ ఈర్యానాయక్, నాయకులు మాచర్ల ప్రభాకర్, చిర్ర మల్లయ్య, గోవర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కందికట్ల రాజయ్య, బద్య, సోమ్లు, రవి, ప్రవీణ్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో శుభ్రత కీలకం



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఖానాపురం : ఆరోగ్య పరిరక్షణలో శుభ్రత కీలకమని వైద్యులు జ్యోతి, రుచిత స్పష్టం చేశారు. మండలంలోని ఐనపల్లిలోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులు జ్యోతి, రుచిత మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడాన్ని దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎలాంటి అనారోగ్య పరిస్థితులు తలెత్తినా వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లి వైద్యం చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రామలింగయ్య, భాస్కర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం



ఖానాపురం : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు జ్యోతి మాట్లాడారు. సమస్యలను పరిష్కరించి సమానమైన వృద్ధి చెందడమే జనాభా దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. జనాభా సమస్యలు, సుస్థిర అభివృద్ధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామలింగయ్య, సిబ్బంది కనకలక్ష్మి, వినోద, ప్రతిభ, భార్గవి, జ్యోతి, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై శ్రీనివాస్ సతీమణికి గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వాలి

నర్సంపేట : సీఐ, ఇతర పోలీసు అధికారుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ సతీమణికి గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చి న్యాయం చేయాలని బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పులి దేవేందర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రముఖ సామాజిక వేత్త నలిగంటి శరత్, సింగర్ యోచన, మహేందర్, పంతంగి భాస్కర్, మారం స్వరూప తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



లింగమూర్తి (ఫైల్)

సంగెం : ఆత్మహత్యకు యత్నించిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మొండ్రాయికి చెందిన ఏడాకుల లింగమూర్తి ఈనెల 10న ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు అతడిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు. మృతుడి తల్లి కొమురమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధి 17వ డివిజన్ వసంతాపూర్‌కు చెందిన కడిదెల కుమారస్వామి ఈనెల 9న అదృశ్యమైనట్లు అతడి కుమారుడు అనిల్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వరంగల్‌కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన కుమారస్వామి తిరిగి రాలేదని చెప్పారు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబూలాల్ తెలిపారు.

భూవివాదంపై పోలీసులకు పరస్పర ఫిర్యాదు

గీసుకొండ : మండలంలోని విశ్వనాథపురంలో సర్వే నంబర్ 29లోని 30 గుంటల భూమి విషయంలో నెలకొన్న వివాదంపై ఇరువర్గాలు పోలీసులకు గురువారం పరస్పరం ఫిర్యాదు చేశాయి. వివరాలిలా.. కొమ్మాలకు చెందిన బట్టమేకల రాజయ్య సదరు భూమిలో రెండు నెలల క్రితం మొక్కజొన్న, చిక్కుడు సాగు చేయగా ప్రవీణ్ అనే మరో రైతు ఆధ్వర్యంలో నమిండ్ల సతీశ్ గడ్డిమందు కొట్టాడు. దీంతో పంటలు ఎండిపోవడంతో రాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా సదరు భూమి తమ సొంతమని, కొన్నేళ్లుగా రాజయ్య అక్రమించుకుని సాగు చేస్తున్నాడంటూ ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇరువురి ఫిర్యాదులపై విచారణ చేస్తున్నామని ఎస్సై జానీపాషా తెలిపారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

దుగ్గొండి : జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులపై మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అరుంధతి గురువారం సమీక్షించారు. గ్రామాల వారీగా చేపట్టిన పనులతోపాటు హరితహారంలో భాగంగా నాటిన మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడారు. గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని చెప్పారు. మొక్కలు నాటడానికి గుంతలు తీసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్ గౌడ్, ఏపీఓ శ్రీనివాస్, ఈసీ రాజు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

సంగెం : సంగెం బైపాస్ రోడ్డులోని విద్యుత్ స్తంభాన్ని గురువారం తెల్లవారుజామున ఓ ట్రాక్టర్ ఢీకొట్టగా స్థానికంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో రిజిస్ట్రేషన్లు, బ్యాంకు సేవలు సాయంత్రం వరకు నిలిచిపోయాయి. కాగా ఘటనలో స్తంభం ధ్వంసం అయ్యింది. ఆ స్తంభంపై నుంచి 11 కేవీ లైన్‌తోపాటుగా కింద రెండు ఎల్‌టీ లైన్లు ఉండగా వాటికి నష్టం వాటిల్లకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నర్సంపేట : వరంగల్‌లోని రోటరీ కమ్యూనిటీ హాల్లో ఈనెల 14న నిర్వహించనున్న న్యూడెమోక్రసీ మాజీ నేత రాధక్క సంస్మరణ సభ వాల్‌పోస్టర్లను పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నాయకులు గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ మాట్లాడారు. రాధక్క సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే రైతులకు మేలు



పొలంలో మహిళా రైతులు, కూలీలతో ఝాన్సీరెడ్డి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి
- నాటు వేసి రైతులతో మాటామంతి

రాయపర్తి : కాంగ్రెస్ హయాంలోనే రైతులకు మేలు జరుగుతుందని ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి స్పష్టం చేశారు. మండలం నుంచి సన్నూరుకు వెళ్తున్న క్రమంలో గురువారం ఆమె పక్కనున్న పొలాల్లో నాటు వేస్తున్న రైతులతో ముచ్చటించారు. అనంతరం పొలంలోకి దిగి మహిళా కూలీలతో కలిసి నాటు వేశారు. అనంతరం ఝాన్సీరెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలనూ తప్పకుండా అమలు చేస్తుందని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సైతం నిత్యం ప్రజల్లో ఉంటూ ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా ప్రజాసమస్యలను దశలవారీగా తప్పకుండా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. త్వరలోనే రైతు రుణమాఫీ అమలు కానుందని తెలిపారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నాయకులు పెద్దగాని సోమయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాల శుభ్రతకు చర్యలు



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న బాలకృష్ణ

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిసరాల శుభ్రతకు చర్యలు చేపడతామని ప్రత్యేక అధికారి డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పాఠశాలలో భవనాల నిర్మాణం త్వరలోనే పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ క్రమంలో పాఠశాలను తాత్కాలికంగా రెండు నెలలు మూసివేసి సమీపంలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో లేదా రైతువేదికలో ఏర్పాటు చేసే విషయమై చర్చించారు. ఎస్సీ హాస్టల్ గ్రామ చివరలో ఉన్న క్రమంలో, అందులో పాములు, తేళ్లు, విషపురుగులు సంచరించే అవకాశం ఉందంటూ తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపారు. అలాగే రైతువేదికలో కనీస సౌకర్యాలు లేవని, చెరువుకు సమీపంలో ఉన్న క్రమంలో పాఠశాలలోనే తరగతులు కొనసాగించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. భవన నిర్మాణాలు తర్వాత చేపట్టవచ్చన్నారు. తల్లిదండ్రుల, గ్రామ పెద్దల నిర్ణయాన్ని తీర్మాన రూపంలో రాసి ఇవ్వాలని ప్రత్యేక అధికారి సూచించారు. అనంతరం తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో కలిసి స్కూల్‌ను ప్రత్యేక అధికారి సందర్శించి మాట్లాడారు. పాఠశాల ఆవరణను పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయిస్తామని, ఇతర సమస్యలూ పరిష్కరిస్తామని చెప్పారు. పాఠశాల ఆవరణ బురదమయం కాకుండా మొరం పోయించేలా చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో ఎంఈఓ, ఉపాధ్యాయులు, కలామ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు భాషమియా, కార్యదర్శి పరికి మధూకర్, ఉపాధ్యక్షులు పోగుల అశోక్, గొల్లపల్లి స్వామి, ప్రశాంత్, మడ్డి కుమారస్వామి, గర్నెపల్లి రాజు, పులి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి సహకరిస్తా

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్



చైర్మన్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి సహకరిస్తానని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ తెలిపారు. కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. కళాశాల అభివృద్ధిపై ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్‌ను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతం నుంచి న్యాక్ ‘ఏ’ గ్రేడ్, అటానమస్ హోదా పొందిన మొదటి కళాశాలగా గుర్తింపు పొందినట్టు ప్రిన్సిపాల్ వివరించగా చైర్మన్ అభినందించి మాట్లాడారు. విద్యార్థుల ప్రయోజనం కోసం తన సహకారం ఉంటుందని చెప్పారు. అనంతరం చైర్మన్ శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఎ.శ్రీనాథ్, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ డాక్టర్ ఐ.శివ నాగ శ్రీను, అధ్యాపకులు ఎల్.సత్యనారాయణ, డాక్టర్ బి.విష్ణుకుమార్, ఎం.సమ్మయ్య, డాక్టర్ లకన్‌సింగ్, ఎం.నరేందర్, టి.సుమతి, ఎం.శైలజ, బి.రమేశ్, పి.త్యాగయ్య, పూర్ణచందర్, బి.వీరన్న, ఆర్.కుమారస్వామి, రమేశ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎస్.స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి



మొక్కలు నాటుతున్న మనోహర్‌రెడ్డి, తదితరులు

నర్సంపేట : సమాజంలోని ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లా మనోహర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని మినీ స్టేడియంలో ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వంద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని కిషన్, వనప్రేమి అవార్డు గ్రహీత గోకా రామస్వామి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. తొలుత మనోహర్‌రెడ్డి మాట్లాడారు. ప్రధాని పిలుపు మేరకు పర్యావరణాన్ని పరిరక్షించేలా మొక్కలు నాటినట్టు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎ.జగన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శి ఎంవి.రామారావు, సభ్యులు లక్ష్మణ్ బాబు, ఈశ్వరమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి



మాట్లాడుతున్న ఎస్సై మహేందర్

నెక్కొండ : మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ యువత సన్మార్గంలో పయనించాలని ఎస్సై మహేందర్ సూచించారు. మండలంలోని సాయిరెడ్డిపల్లిలో పోలీస్ కళాజాత బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మెరుగైన సమాజ నిర్మాణంలో యువత కీలకమని చెప్పారు. గుట్కా, గంజాయి, డ్రగ్స్, తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. చదువు, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, ఈవ్ టీజింగ్, సీసీ కెమెరాలు, షీ టీమ్స్, మూఢనమ్మకాలు, తదితరాలపై మ్యాజిక్ షో నిర్వహించారు. సామాజిక అంశాలు, సైబర్ క్రైమ్‌పై ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, విక్రమ్‌రాజ్, నారాయణ, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.